

పోలియో రహితంగా..
కామారెడ్డిని పోలియో రహిత జిల్లాగా మార్చాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పిలుపునిచ్చారు.
- 8లో ▸



భౌతికశాస్త్రంతో భవిష్యత్
భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో భౌతికశాస్త్రంపై అవగాహన సదస్సు నిర్వహించారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.2 /18.0
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోత పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు గ్రూప్–1 ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదిలోపు సుభాష్‌నగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులను అందించాలన్నారు. విద్యార్హత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డ్ జిరాక్స్ దరఖాస్తుకు జత చేయాలని సూచించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు..

కామారెడ్డి అర్బన్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(బేగంపేట, రామంతపూర్)లో ఒకటో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి రజిత తెలిపారు. జిల్లానుంచి ఐదుగురు ఎస్టీలు, ఒక ఎస్సీ విద్యార్థికి సీటు దక్కుతాయని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని 208 వ నంబర్ గదిలో సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీని తనిఖీ చేసిన న్యాయమూర్తి



కామారెడ్డి టౌన్: టేక్రియాల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం జిల్లా సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి టి.నాగరాణి తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. వారికి చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వంటగదిని పరిశీలించారు. వంట సరుకులు నాసిరకంగా ఉండడంతో ప్రిన్సిపాల్ లావణ్యను మందలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

'గృహజ్యోతి' ప్రారంభం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గృహజ్యోతి పథకాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శనివారం ప్రారంభించారు. పట్టణంలోని బీసీ కాలనీలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన వారికి జీరో బిల్లులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రతిగ్రామంలో 100 ఇళ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డి శివారులో 300 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. త్వరలోనే ఎల్లారెడ్డిలో లెదర్ పార్కు ఏర్పాటు కానుందని తెలిపారు. తాను ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ఇప్పటివరకు నియోజకవర్గానికి రూ. 148 కోట్ల నిధులను తీసుకువచ్చానన్నారు. కార్యక్రమంలో డీఈ గణేష్, ఏఈ సత్యనారాయణ, కౌన్సిలర్ మహేశ్వరి, ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు గయాజుద్దీన్, కుర్మ సాయిబాబా, విద్యాసాగర్, అజర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్: అడ్లూర్‌ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం నాటికి 3 లక్షల 21 వేల 887 మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ జరిగిందని ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావ్ తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామని పేర్కొన్నారు.


స్పైసెస్ మార్కెటింగ్‌పై అవగాహన

రుద్రూర్: రుద్రూర్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో శనివారం మేరా యువ భారత్ కార్యక్రమంలో భాగంగా స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో విద్యార్థులకు సుగంధ ద్రవ్య పంటలు–మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా గుజరాత్‌కు చెందిన అసిస్టెంట్ రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ స్వామినాథన్ డిజిటల్ మార్కెటింగ్ టెక్నిక్స్ వివరించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి బాలాజీ నాయక్, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త రాజ్‌కుమార్, మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ యశ్వంత్ కుమార్, జిల్లా స్పైసెస్ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ సుందరేషన్, కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పాటిల్‌కే బీజేపీ టికెట్టు

- కాషాయ కండువా కప్పుకున్న మరుసటి రోజే ప్రకటన
- నిరాశలో ఆశావహులు





జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో కాషాయ జెండా ఎగురవేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న బీజేపీ.. అందరికన్నా ముందుగా అభ్యర్థిని ప్రకటించి ప్రత్యర్థులకు సవాల్ విసిరింది. పార్టీ అభ్యర్థిగా బీబీ పాటిల్ పేరును ప్రకటించింది. అయితే కారు దిగి కాషాయ కండువా కప్పుకున్న మరుసటి రోజే ఆయనకు పార్టీ టికెట్టు కేటాయించడం గమనార్హం. కాగా పార్టీ టికెట్టు ఆశించిన పలువురు నేతలు తీవ్ర నిరాశకు గురయ్యారు.

సాక్షి, కామారెడ్డి/నిజాంసాగర్: పార్లమెంట్ ఎన్నికలలో సత్తా చాటడానికి కాషాయ సేన కసరత్తు చేస్తోంది. అబ్‌కీ బార్ చార్‌సౌ పార్... నినాదంతో ముందుకు సాగుతున్న బీజేపీ.. క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు పలుమార్లు సమావేశాలు నిర్వహించింది. పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ ఆయా సమావేశాలలో పాల్గొని కార్యకర్తలతో మాట్లాడారు. టికెట్టు ఎవరికి వచ్చినా పార్టీ అభ్యర్థి గెలుపు కోసం శ్రమించాలని ఆయన క్యాడర్‌ను కోరారు. పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్ సైతం ముఖ్య నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. పార్టీ గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. విజయ సంకల్ప యాత్ర పేరుతో అన్ని నియోజకవర్గాలను చుట్టేశారు.

30 మందికిపైగా ఆశావహులు..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గంలో ఇద్దరు ఉద్దండులను ఓడించి విజయ తీరాలకు చేరడంతో బీజేపీలో జోష్ పెరిగింది. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నియోజకవర్గాలలో గణనీయ సంఖ్యలో ఓట్లు కూడా రావడం, ప్రధాని మోదీ చరిష్మా, అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తి వంటి అంశాలు పార్లమెంట్ ఎన్నికలలో కలిసి వస్తాయని భావించిన పలువురు నేతలు.. బీజేపీ టికెట్టు ఆశించారు. కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన నేతలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన రాష్ట్ర స్థాయి నాయకులూ ఆసక్తి చూపుతున్నారు. కామారెడ్డి జిల్లాకు చెందిన సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లికి చెందిన న్యూస్ చానల్ యజమాని ఏలేటి సురేశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, నేతలు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, డాక్టర్ రాంసింగ్, ఎంజీ చక్రవర్తి గౌడ్, సోమాయప్ప స్వామీజీ, మేడపాటి ప్రకాశ్ రెడ్డి, మెదక్ జిల్లాకు చెందిన డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, ఇతర ప్రాంతాల నేతలు బద్దం మహీపాల్‌రెడ్డి, ఆకుల విజయ, ఆలె భాస్కర్.. ఇలా చాలామంది బీజేపీ టికెట్టు ఆశించారు. వారందరి ఆశలను గల్లంతు చేస్తూ పార్టీ అధిష్టానం బీబీ పాటిల్‌కు టికెట్టు కేటాయించింది. పార్టీ నిర్ణయంతో ఎంపీ టికెట్టు ఆశించినవారంతా తీవ్ర నిరాశకు గురయ్యారు.

ఇలా వచ్చి అలా టికెట్టు పట్టి..

డోంగ్లీ మండలంలోని సిర్పూర్ గ్రామవాసి, లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన బీబీ పాటిల్ 2014 సంవత్సరంలో బీఆర్‌ఎస్‌లో చేరి రాజకీయ ఆరంగ్రేటం చేశారు. అదే సంవత్సరంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో జహీరాబాద్ స్థానం నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను ఓడించి తొలిసారి ఎంపీ అయ్యారు. 2019లో బీఆర్‌ఎస్ నుంచి రెండోసారి పోటీ చేసిన ఆయన.. కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును ఓడించారు. రెండు రోజుల క్రితమే బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన మరుసటి రోజే బీబీ పాటిల్‌ను జహీరాబాద్ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించడం గమనార్హం.

నిజామాబాద్ అభ్యర్థిగా అర్వింద్



బీజేపీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా మరోసారి ధర్మపురి అర్వింద్‌కే అవకాశం ఇచ్చింది. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో ఆయన కమలం గుర్తుపై పోటీ చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల కవితను ఓడించారు. మరోసారి ఆయనకే నిజామాబాద్ టికెట్టు కేటాయిస్తూ పార్టీ నిర్ణయం తీసుకుంది.

పాలనలో మార్పు రాలేదు



మాచారెడ్డిలో విజయ సంకల్ప యాత్ర సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

- బీఆర్‌ఎస్‌లాగే కాంగ్రెస్ వ్యవహరిస్తోంది
- పైరవీలతో అధికారులకు పోస్టింగ్‌లు..
- ప్రభుత్వంపై ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి విమర్శలు

కామారెడ్డి టౌన్: తెలంగాణలో ప్రభుత్వం మారిందే తప్ప పాలన తీరు మారలేదని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వం లాగే ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఏడు లక్షల కోట్లు అప్పులు చేస్తే.. పోటీగా ప్రస్తుత ప్రభుత్వం అంతకుమించి అప్పులు చేసేందుకు సిద్ధమవుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో నచ్చిన చోట పోస్టింగ్ పొందేందుకు ఎస్సైనుంచి ఐఏఎస్ అధికారుల వరకు పైరవీలు చేసుకుంటున్నారన్నారు. ఒక్కో పోస్టుకు రూ. 10 లక్షలనుంచి రూ. 50 లక్షల వరకు చెల్లించి నచ్చిన చోట పోస్టింగ్ తీసుకుంటున్నారని ఆరోపించారు. కామారెడ్డి నియోజకవర్గంలో అవినీతికి తావులేదని, డబ్బులు పోసి కామారెడ్డికి రావద్దని, నిజాయితీగా ఉండాలనుకునేవారే ఇక్కడికి అధికారులకు సూచించారు. దేశంలో పారదర్శక పాలన కొనసాగాలంటే బీజేపీ మరోసారి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అత్యధిక పార్లమెంట్ స్థానాలలో బీజేపీ విజయం సాధిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, పార్లమెంట్ ప్రభారి మైపాల్‌రెడ్డి, నాయకులు నీలం చిన్నరాజులు, వెంకట్‌రెడ్డి, ఆకుల భరత్, సురేష్, విపుల్, లక్ష్మారెడ్డి, తేలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి: బైక్ ర్యాలీలో బీజేపీ కార్యకర్తలు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దొందూదొందే

మాచారెడ్డి: ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు దొందూదొందేనని బీజేపీ జహీరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి విమర్శించారు. శనివారం పాల్వంచ, మాచారెడ్డి మండలాలలో విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్వంచ మండలం ఆరేపల్లి నుంచి మాచారెడ్డి వరకు బీజేపీ కార్యకర్తలు బైక్ ర్యాలీ తీశారు. ఆయా గ్రామాలలో పార్టీ జెండాలను ఎగుర వేశారు. మాచారెడ్డిలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశాభివృద్ధి కోసం బీజేపీకే ఓటేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నాల వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నరసింహాచారి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోట బాల్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి బూస సురేష్, మహిళా అధ్యక్షురాలు హారిక తదితరులు పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి'



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: యాసంగి సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సహకార సంఘాల ఆధ్వర్యంలో 325, ఐకేపీ ఆధ్వర్యంలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యాసంగిలో వచ్చే వరి పంట దిగుబడిని అంచనా వేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఏవో భాగ్యలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, ఏఎస్‌వో నిత్యానంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి..

నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా చూడాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీలోగల మున్సిపల్ నర్సరీని శనివారం ఆయన పరిశీలించారు. నర్సరీలో పెరుగుతున్న మొక్కల వివరాలను తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లా ఆస్పత్రిని శుభ్రంగా ఉంచండి

కామారెడ్డి టౌన్: జిల్లా జనరల్ ఆస్పత్రి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం ఆయన ఆస్పత్రిని తనిఖీ చేశారు. పరిసరాలను చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం గది వద్ద ట్యాంక్‌ను కూల్చి, రోగుల బంధువులు భోజనాలు చేసేందుకు షెడ్‌ను నిర్మించాలని సూచించారు. పెచ్చులూడుతున్న చోట మరమ్మతులు చేయించాలన్నారు. వృథాగా ఉంటున్న ట్రామా కేర్ అంబులెన్స్‌ను మెడికల్ కళాశాల వద్దకు తరలించాలన్నారు. పార్కింగ్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారం మొక్కలు ఎండిపోవడంతో ఆస్పత్రి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, ఆర్‌ఎంవో శ్రీనివాస్ తదితరులున్నారు.



ఇంటర్‌లో జోరుగా మాస్ కాపీయింగ్

- ర్యాంకుల కోసం కళాశాలల అడ్డదారులు
- చిట్టీలిచ్చి ప్రోత్సహిస్తున్న లెక్చరర్లు, సిబ్బంది
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఇష్టారాజ్యం



కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్: ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెంచుకునేందుకు, ర్యాంకుల కోసం పలు కళాశాలలు అడ్డదారులు తొక్కుతున్నాయి. లెక్చరర్లు చిట్టీలు ఇస్తున్నారని, పరీక్షల నిర్వహణ బాధ్యతల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులు దీనికి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని దాదాపు అన్ని పరీక్ష కేంద్రాల్లో జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

పర్యవేక్షణ లోపం..

జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు 37 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 16 ప్రభుత్వ కళాశాలలతోపాటు 12 ప్రభుత్వ సంస్థలు, 9 ప్రైవేటు కళాశాలల భవనాల్లో పరీక్ష కేంద్రాలున్నాయి. పరీక్షల నిర్వహణ కోసం 37 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 9 మంది అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఆరుగురు సిట్టింగ్ స్క్వాడ్‌లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఇద్దరు జిల్లా కోఆర్డినేటర్‌లను నియమించారు. అయితే పర్యవేక్షణ బృందాలున్నా మాస్ కాపీయింగ్‌ను అడ్డుకోలేకపోతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో కళాశాలల యాజమాన్యాలు, పరీక్ష సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చిట్టీలిచ్చి మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఉత్తీర్ణత శాతం పెంచుకోవడానికి జిల్లా అధికారితో పాటు విధుల్లో ఉన్న కొందరు పరీక్ష నిర్వహణ అధికారులతో ఒప్పందాలు చేసుకుని మాస్ కాపీయింగ్ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు రామారెడ్డి, సదాశివనగర్ ప్రభుత్వ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు సహాయం చేసేందుకు సదరు పరీక్షల అధికారులు భారీగా డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆయా కళాశాలలు పరీక్షల నిర్వహణ అధికారులతో కుమ్మక్కైనట్లు వారం రోజుల క్రితమే విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడం గమనార్హం. ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలతో పాటు కొందరు ప్రభుత్వ కళాశాలల రెగ్యులర్, కాంట్రాక్ట్ లెక్చరర్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై విచారణ జరిపించాలన్న డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్ష నిర్వహణ అధికారులు, సిబ్బంది మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తే కేసులు నమోదు చేస్తాం. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు.
– షేక్ సలాం, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి, కామారెడ్డి

నలుగురిపై సస్పెన్షన్ వేటు

సదాశివనగర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ప్రతాప్‌కిరణ్, డిపార్ట్‌మెంటల్ అధికారి రాజాగౌడ్‌తోపాటు మాల్ ప్రాక్టీస్‌ను ప్రోత్సహించిన హిందీ లెక్చరర్ ఇస్రత్, కెమిస్ట్రీ లెక్చరర్ రంజిత్‌కుమార్‌లను సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వకుండా పరీక్షలను నిర్వహించాలని లేకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా జడ్జి ఎస్‌ఎన్ శ్రీదేవి

కామారెడ్డి క్రైం: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్‌ఎన్. శ్రీదేవి సూచించారు. జిల్లాకేంద్రంలోని కోర్టు హాల్‌లో శనివారం జిల్లాలోని పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ న్యాయవాదులతో ప్లీ బార్గెయినింగ్, సెక్షన్ 360 సీఆర్‌పీసీపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ఒక క్రిమినల్ నేరం మోపబడిన వ్యక్తి నేరాన్ని అంగీకరించడం ద్వారా శిక్ష తగ్గించాలని కోరుతూ ప్రాసిక్యూషన్‌తో చర్చలు జరిపే ప్రక్రియను ప్లీ బార్గెయినింగ్ అంటారన్నారు. అలాగే 360 సీఆర్‌పీసీపై కూడా అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి కే.సుధాకర్, పీపీ రాజగోపాల్ గౌడ్, పోక్సో కోర్టు పీపీ శేషు, మెజిస్ట్రేట్ కోర్టు పీపీ అశోక్ శివరాం, సబ్ కోర్టు పీపీ దామోదర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్లీ బార్గెయినింగ్, సీఆర్‌పీసీ 360 సెక్షన్ గురించి అవగాహన కల్పిస్తున్న జిల్లా జడ్జి శ్రీదేవి

జాతీయ లోక్ అదాలత్ 16వ తేదీకి వాయిదా

జాతీయ లోక్ అదాలత్‌ను సెలవుల కారణంగా వాయిదా వేసినట్లు జిల్లా జడ్జి శ్రీదేవి తెలిపారు. ఈనెల 9 న నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని 16 వ తేదీకి వాయిదా వేశామన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో రాజీ కుదుర్చుకోదగిన కేసులను ఇరు పక్షాల అంగీకారంతో సత్వరమే పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. అన్ని సివిల్ కేసులు, వైవాహిక వివాదాలు, భూ వివాదాలు, విభజన, ఆస్తి వివాదాలు, కార్మిక వివాదాలు, బ్యాంకు రికవరీ వివాదాలు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించే వేదిక అయిన లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేంద్ర పర్యాటక ప్రాజెక్టుగా కల్కి చెరువు!

బాన్సువాడ: కేంద్ర పర్యాటక ప్రాజెక్టుగా బాన్సువాడ కల్కి చెరువును ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రెండు పర్యాటక ప్రాజెక్టులు మంజురయ్యే అవకాశాలున్నాయి. ప్రకృతి, పర్యాటకం గమ్య స్థానాల్లో బాన్సువాడ కల్కి చెరువు షార్ట్ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ చెరువులో ఏడాదంతా నీళ్లుంటాయి. నీళ్లు తగ్గితే నిజాంసాగర్ ఉప కాలువ డి -10 ద్వారా నీరు విడుదల చేసి నీటి మట్టాన్ని పెంచుతారు. మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి కల్కి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేశారు. చెరువు చివరి భాగంలో చిల్డ్రన్స్, మల్టీ జనరేషన్ పార్కులతో ప్రజలకు ఆహ్లాద వాతావరణాన్ని కల్పించారు. చెరువు కట్టపై ఉదయం, సాయంత్రం వేళ్లలో వాకింగ్ చేయడానికి వీలుగా టైల్స్ వేయించారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఇటీవల కల్కి చెరువును సందర్శించారు. చెరువు అభివృద్ధి కోసం టూరిజం కార్పోరేషన్ ద్వారా నిధులు మంజూరు అవుతున్నాయని ప్రకటించారు. కేంద్ర పర్యాటక ప్రాజెక్టుగా కల్కి చెరువును ఎంపిక చేస్తే రూ. 10 కోట్ల నిధులు మంజురయ్యే అవకాశాలున్నాయి. దీంతో కల్కి చెరువు పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందనుంది.



బాన్సువాడ కల్కి చెరువు

క్లుప్తంగా

ఘనంగా దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి



కామారెడ్డి క్రైం : బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి మాజీ స్పీకర్ శ్రీపాద రావు ఎంతగానో కృషి చేశారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా యువజన, క్రీడల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాద రావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ హాజరై శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా యువజన, క్రీడల అధికారి వై. దామోదర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ క్రైం డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ స్పీకర్ శ్రీ పాదరావు జయంతి నిర్వహించారు. సీఐలు జార్జ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు విద్యుత్ ఉద్యోగులు



బీబీపేట : ఎస్సీ, ఎస్టీ తెలంగాణ నూతన డైరీ ఆవిష్కరణకు బీబీపేట మండలం నుంచి విద్యుత్ ఉద్యోగులు శనివారం బయల్దేరి వెళ్లారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ చైర్మెన్ వెంకయ్య, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు హాజరవుతున్నట్లు కామారెడ్డి డివిజన్ అసిస్టెంట్ సెక్రటరి నాంపల్లి తెలిపారు. బయల్దేరిన వారిలో విద్యుత్ సిబ్బంది రవి, నర్సింలు, వెంకటస్వామి, బాల్‌నర్సు, బాలేశం, రాజయ్య తదితరులు వెళ్లారు.

అయోధ్య రాముడి సిందూరం



భిక్కనూరు : మండల కేంద్రంలో రామదండు ప్రతినిధులు అయోధ్య నుంచి తీసుకొచ్చిన హనుమాన్ సింధూరంతో ప్రజల నుదుట శ్రీరామ్ అక్షరాలను బొట్టుగా శనివారం పెట్టారు. పలువురు రామదండు ప్రతినిధులు అయోధ్య వెళ్లి బాలరాముడిని దర్శించుకుని హనుమాన్ సింధూరంను అక్కడి నుంచి తీసుకొచ్చి మండలకేంద్రంలో భక్తులకు పెడుతున్నారు. ఈ కార్యక్రమంలో రామదండు ప్రతినిధులు గొల్ల రమేష్, భగీరథ్, కేవిసుబ్బారావు, లక్ష్మీ నారాయణగౌడ్, జగ్గారెడ్డి, మల్లేషం, వింగ్ డైరెక్టర్ బచ్చగారి నర్సింలు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

కామారెడ్డి అర్బన్ : అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా శనివారం పట్టణ పరిధిలోని దేవునిపల్లి, డ్రైవర్స్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల తల్లులకు లింగ వివక్షత, మహిళ హింస వ్యతిరేక దినోత్సవం, హెల్ప్‌లైన్ నంబర్లు 181, 1098, 100, 14567, షీటీంల పై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ అధికారులు శారద, పద్మ, సఖి అధికారులు సాయవ్వ, కవిత, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

అమలులోకి 'గృహజ్యోతి'

- జిల్లాలో 1,58,020 మందికి జీరో బిల్లులు
- 4వ తేదీన ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం
- ఉమ్మడి కుటుంబాల్లో ఆందోళన



జీరో బిల్లు అందిస్తున్న జిల్లా ఎస్ఈ అధికారి రమేశ్ బాబు, రాయితీ జీరో బిల్లు

బిచ్కుంద(జుక్కల్) : జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం అమలు ప్రారంభమైంది. దీంట్లో భాగంగా ఇప్పటికే విద్యుత్ శాఖ అధికారులు ప్రతి ఇంటికీ తిరిగి విద్యుత్‌మీటర్లకు తెల్ల రేషన్ కార్డుల అనుసంధానం పూర్తిచేశారు. 200 యూనిట్లలోపు ఉన్న విద్యుత్ బిల్లులకు జీరో బిల్లులు అందిస్తున్నారు. మార్చి నెలలో గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లులు వస్తుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అర్హులై ఉండి మార్చి నెలలో జీరో బిల్లులు రాకపోతే ఆందోళన చెందవద్దని విద్యుత్ శాఖాధికారులు పేర్కొంటున్నారు. బిల్లింగ్ మిషన్‌కు అనుసంధానం(లింగ్) కాని వారికి మాత్రమే ఎప్పటిలాగే బిల్లులు వస్తున్నాయని, అలాంటి వారి ఆధార్, రేషన్‌కార్డు, మీటర్ నంబర్ తదితర వివరాలు అందజేస్తే వచ్చే నెలలో జీరో బిల్లు వస్తుందని అధికారులు సూచిస్తున్నారు.

ఉమ్మడి కుటుంబాల్లో ఆందోళన

చాలామందికి రేషన్‌కార్డులు లేకపోవడంతో వారంతా తమ కనెక్షన్లను గృహజ్యోతి పథకానికి అనుసంధానం చేసుకోలేకపోతున్నారు. అలాగే ఇద్దరు ముగ్గురు ఉన్న ఉమ్మడి కుటుంబాలు కలిసి ఒకే ఇంట్లో ఉంటే వీరందరికి కలిపి ఒకే మీటర్ ఉంటోంది. నెలవారి విద్యుత్ వినియోగం పరిమితి మించి 200యూనిట్లు దాటితే వారు గృహజ్యోతి పథకంలోకి రావట్లేదు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. అయితే గృహజ్యోతి ప్రక్రియ నిరంతరంగ ఉంటుందని తెల్లరేషన్ కార్డులు లేని వారు కార్డు వచ్చిన తర్వాత ఎంపీడీవో, విద్యుత్ కార్యాలయంలో పథకానికి దరఖాస్తు చేసుకుంటే వచ్చేనెల నుంచి జీరో బిల్ వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే మిషన్ కల్లాలి గ్రామంలో 4న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రారంభించి లబ్ధిదారులకు రాయితీ జీరో బిల్లును అందించనున్నారు.

జిల్లాలో..

జిల్లాలో 2,35,420 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో తెల్లరేషన్ కార్డులు ఉన్న గృహ కనెక్షన్లు 2,02,030 ఉన్నాయి. గృహజ్యోతి పథకానికి లింక్ చేసిన కనెక్షన్లు లక్ష 58 వేల మంది లబ్ధిదారులు జీరో బిల్లు పొందుతున్నారని విద్యుత్ అధికారులు సూచించారు.

పోలియో రహిత జిల్లాగా మార్చాలి



జిల్లా కేంద్రంలో జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్ : పోలియో రహిత కామారెడ్డి జిల్లాగా మార్చాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ నెల 3న ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వీలుగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట పల్స్ పోలియో కార్యక్రమ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలో ప్రధాన వీధుల గుండా నిజాంసాగర్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు చుక్కలు అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరు పోలియో వ్యాధిబారిన పడకుండా ఈ నెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. అన్ని నివాస ప్రాంతాలలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ప్రభుత్వ ఆసుపత్రులలో, అంగన్వాడీ కేంద్రాలు, పల్స్ పోలియో బూత్ లు, రైల్వే స్టేషన్, బస్టాండ్ ల వద్ద ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలియో నివారణ కోసం చుక్కల మందు వేయడం జరుగుతుందన్నారు. పిల్లలు జ్వరం, జలుబు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నా కూడా వారికి చుక్కల మందు వేయించాలని సూచించారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కల మందు వేయించాలని కోరారు. పల్స్ పోలియో అవగాహన ర్యాలీలో జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్, వైద్యారోగ్య శాఖ అధికారులు, ఏ.ఎం.ఎంలు,ఆశ వర్కర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మరో అవిశ్వాసానికి రంగం సిద్ధం?

- సుముఖంగా ఉన్న నల్లవెల్లి సొసైటీ డైరెక్టర్లు
- ఐడీసీఎంఎస్ చైర్మన్‌కు పదవీ గండం!
- కీలకంగా వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధి



నల్లవెల్లి సహకార సంఘం



మోహన్, ఐడీసీఎంఎస్ చైర్మన్

ఇందల్వాయి: ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్‌కు పదవీగండం పొంచి ఉందని పలువురు పేర్కొంటున్నారు. నల్లవెల్లి సహకార సొసైటీ చైర్మన్‌గా ఎన్నికై అనూహ్య పరిణామాల మధ్య ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా సాంబారి మోహన్ ఎన్నికయ్యారు. అయితే, నల్లవెల్లి సొసైటీలోని ఎనిమిది మంది సభ్యులు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానికి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంలో కీలకంగా వ్యవహరిస్తున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధిని ఇప్పటికే సిర్నాపల్లి గ్రామానికి చెందిన నలుగురు డైరెక్టర్లతోపాటు నల్లవెల్లికి చెందిన ఇద్దరు కూడా కలిసినట్లు సమాచారం. మరో ఇద్దరు బీజేపీ అనుకూల డైరెక్టర్లను ఒప్పించేందుకు నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ కీలక నాయకుడితో మిగతా డైరెక్టర్లు మాట్లాడుతున్నట్లు సమాచారం. అంతా డైరెక్టర్లు అనుకున్నట్లు జరిగితే.. మరో వారం రోజుల్లో అవిశ్వాస తీర్మనం ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి.

ముఖ్యమంత్రి చెంతకు..

అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టాలనే డైరెక్టర్ల ఆలోచన వెనుక సూత్రధారిగా ఉన్న ప్రజాప్రతినిధిని ఐడీసీఎంఎస్ చైర్మన్ కలిసి తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతానని, అవిశ్వాస తీర్మానాన్ని విరమించుకునేలా చేయాలని కోరినట్లు సమాచారం. అక్కడ ఫలితం లేకపోవడంతో జిల్లా కు చెందిన కీలక నేతల సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

ఉమ్మడి జిల్లాలో 15 చోట్ల అవిశ్వాస తీర్మానాలు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 15 చోట్ల అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టినట్లు డీసీవో శ్రీనివాసరావు తెలిపారు. నాలుగు చోట్ల అవిశ్వాస తీర్మానాలు నెగ్గగా, కామారెడ్డిలో ఐదు చోట్ల, నిజామాబాద్‌లో నాలుగు చోట్ల బలనిరూపనకు తేదీలు ఇచ్చామని, మరో రెండు చోట్ల కోర్టు స్టే ఆర్డరు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

భౌతికశాస్త్ర విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

- ఐఐటీ భౌతికశాస్త్ర ప్రొఫెసర్ సూర్యనారాయణ
- సౌత్‌క్యాంపస్‌లో విద్యార్థులకు సబ్జెక్ట్‌పై అవగాహన



మాట్లాడుతున్న హైదరాబాద్ ఐఐటీ భౌతికశాస్త్ర ప్రొఫెసర్ సూర్యనారాయణ

భిక్కనూరు : తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో భౌతికశాస్త్ర విద్యార్థులకు హైదరాబాద్‌లోని ఐఐటీ ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించనున్నట్లు ఐఐటీ భౌతికశాస్త్ర ప్రొఫెసర్ సూర్యనారాయణ అన్నారు. శనివారం ఆయన వర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో నిర్వహించిన భౌతికశాస్త్రంపై అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌతికశాస్త్రం అభ్యసించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సబ్జెక్ట్‌ను అభ్యసించిన వారికి విదేశాల్లో డిమాండ్ ఉందన్నారు. ప్రతి విద్యార్థి ముందు చూపుతో పరిశోధనల వైపు తమ దృష్టిని సారించాలని సూచించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఈ స్థాయికి వచ్చానన్నారు. మంచి ఆలోచనలు కల్గిన వ్యక్తుల స్నేహం మన ఎదుగుదలకు దోహదం చేస్తాయన్నారు. ప్రతి ఏడాది జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఒక థీమ్‌ను ఇస్తుందని ఈసారి వికసిత భారత్ కోసం స్వదేశీ శాస్త్ర సాంకేతికతలు అనే అంశం ఎంచుకోబడిందన్నారు. మానవ సహిత గగన్‌యాన్‌కు నలుగురు వ్యోమగామలు సిద్ధమయ్యారన్నారు. మరిన్ని విజయాలు సాధించాలంటే భవిష్యత్ తరాలు ఈ రంగంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ గౌడ్, ఫిజిక్స్ బీవోస్ డాక్టర్ లలిత, మోహన్‌బాబు, కెమిస్ట్రీ హెచ్‌వోడీ నాగరాజు, ఫిజిక్స్ అధ్యాపకులు వైశాలి, డాక్టర్ సరిత పిట్ల దిలీప్, శ్రీమాత, హాస్టల్ వార్డెన్ యాలాద్రి శ్రీనివాస్ కనకయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



కామారెడ్డి రూరల్ : జాతీయ ఉపాధిహామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని ఎంపీడీవో నాగవర్ధన్ సూచించారు. శనివారం మండలంలోని శాబ్దిపూర్, గర్గుల్, ఇస్రోజీవాడి గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామాల్లో నర్సరీ, గొర్రెల షెడ్డు, పశువుల షెడ్డుకు దరఖాస్తులు చేసుకుంటే మంజూరు ఇస్తామన్నారు. ఉపాధిహామీ పనుల్లో లేబర్ శాతాన్ని పెంచాలన్నారు. ఆయ న వెంట ఎంపీవో మలహరి, గ్రామ కార్యదర్శు లు గణేష్, శోభ, కల్పన తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : గ్రామాలలో బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరీబాయి సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని పలురికార్డులను ఆమె పరిశీలించారు. దీంతోపాటు జాతీయ మహిళ దినోత్సవంపై గర్భిణులకు, బాలింతలకు ఆమె అవగాహన కల్పించారు. బేటీ పడావో- బేటీ బచావో గురించి ఆమె వివరించారు. ఆమె వెంట అంగన్‌వాడీ టీచర్లు యేసుమణి, సురేఖ ఉన్నారు.

పింఛన్ ఆశ చూపి రూ.20వేలు కాజేత

దోమకొండ: నెలకు రూ.25వేల పింఛన్ ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి ఓ మహిళ నుంచి రూ.25వేలు కాజేసిన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన లక్ష్మి పింఛన్ డబ్బులు తీసుకొని ఇంటికి వెళ్తుండగా, బైక్‌పై ఇద్దరు వ్యక్తులు ఎదురు వచ్చారు. లక్ష్మితో మాట్లాడిన వారు.. నీ భర్త దుబాయిలో చనిపోయాడు కాబట్టి నెలకు రూ.25వేల పింఛన్ ఇప్పిస్తామని నమ్మబలికారు. గతంలో కూడా తాము మీ ఇంటికి వచ్చామని కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు తెలుపగా ఆమె నమ్మింది. తన వద్ద ఉన్న పింఛన్ డబ్బులు రూ.2వేలతోపాటు తన కూతురికి చెందిన రూ.18వేలు మొత్తం రూ.20వేలు వారికి ఇచ్చింది. మాయమాటలతో నమ్మించిన సదరు వ్యక్తులు ఆ తరువాత కనిపించకుండాపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై ఏఎస్సై సుబ్రహ్మణ్యచారిని వివరణ కోరగా, ఫిర్యాదు అందిందని ఆయన తెలిపారు.

రేషన్‌షాపులకు ముక్కిన బియ్యం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో ముక్కినవి రావడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. బియ్యం జాలీలు కట్టి నల్లగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం బియ్యాన్ని లబ్ధిదారులకు ఎలా పంపిణీ చేయాలో అర్థం కావడం లేదని రేషన్ డీలర్లు వాపోతున్నారు. మండలంలోని అన్నిరేషన్ షాపుల్లో నాలుగు నుంచి ఐదుసంచులు ఇదే రకం బియ్యం రావడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి నల్లగావచ్చిన ముక్కిన బియ్యం సంచులను వాపసు తీసుకొని మంచి బియ్యం సరఫరా చేయాలని కోరుతున్నారు.

427మంది గైర్హాజరు

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ రెండో సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు శనివారం 427 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 97 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తెలిపారు. మొత్తం 57 సెంటర్లకుగాను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, స్క్వాడ్లు 46 కేంద్రాలను తనిఖీ చేశారు. ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మధుమలంచ జూనియర్ కళాశాల సెంటర్లతోపాటు మరో ఆరు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు తనిఖీ చేశారు.

నేటి నుంచి పీజీ తరగతులు

నిజామాబాద్‌అర్బన్: ఈనెల 3 నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ మొదటి సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్ రంజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. మిగతా వివరాలకు 73829 29612 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గంజాయి పట్టివేత

- ముగ్గురిపై కేసు నమోదు, రిమాండ్



ఎక్సైజ్ పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

నిజామాబాద్ రూరల్(డిచ్‌పల్లి): డిచ్‌పల్లి మండలంలోని దేవుపల్లి సమీపంలో గంజాయి విక్రయిస్తున్న పవన్‌కళ్యాణ్ అనే వ్యక్తిని ఆర్మూర్ సర్కిల్ ఎక్సైజ్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్మూర్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్టీవెన్‌సన్, సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ చైతన్య శనివారం రూట్‌వాచ్ చేస్తుండగా, దేవుపల్లి సమీపంలో ద్విచక్రవాహనంపై పవన్‌కళ్యాణ్ అనుమానాస్పదంగా కనించాడు. వెంటనే అతడిని తనిఖీ చేయగా, అతడి వద్ద 170 గ్రాముల గంజాయి లభించింది. పవన్‌కళ్యాణ్‌ను ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా, తాను నిజామాబాద్ నగరంలోని గృహకల్ప కాంప్లెక్స్, అసద్‌బాబానగర్, నందిగుట్ట ప్రాంతాల్లో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపాడు. సీఐతోపాటు ఎస్సై జిల్లా కేంద్రానికి వెళ్లి ఆయా ప్రాంతాలకు వెళ్లి అనుమానాస్పదంగా తిరుగుతున్న విజయరాఘవ, రాజును అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద 100 గ్రాముల ఎండు గంజాయి లభించింది. గంజాయితో పట్టుబడిన వారిన అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ, ఎస్సై తెలిపారు. దాడిలో సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, కానిస్టేబుళ్లు ధర్మేందర్, వికాస్, సందీప్, సాయిబాబా,గొల్ల శ్రీనివాస్,నరేశ్,మోహన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో నలుగురు మృతి

రెంజల్(బోధన్): కందకుర్తి పుష్కరఘాట్ వద్ద గోదావరిలో శుక్రవారం గల్లంతైన బాలమణి (35) మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్ తెలిపారు. భర్త ఎల్లయ్య ఫిర్యాదు మేరకు స్థానిక జాలర్లతో గోదావరిలో శనివారం గాలించగా, బాలమణి మృతదేహం లభ్యమైందన్నారు. బోధన్ మండలం పాండు ఫారం గ్రామానికి చెందిన బాలమణి కుటుంబసభ్యులతో కలిసి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చింది. బాబ్లీ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదలడంతో నీటి ప్రవాహనికి కొట్టుకుపోయిందని, బాలమణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని షేక్ అలీ(46) అనే వ్యక్తి మృతి చెందాడు. కామారెడ్డి పట్టణంలోని బతుకమ్మకుంటకు చెందిన షేక్ అలీ కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తాడు. ద్విచక్ర వాహనంపై కామారెడ్డి నుంచి గాంధారి వైపునకు వస్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రఫియాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

చెరువులోపడి ఒకరు..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మల్లూర్ గ్రామానికి చెందిన పట్నం సాయిలు (33) ప్రమాదవశాత్తు గ్రామ ఊరచెరువులోపడి మృతి చెందాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్లిన సాయిలు ప్రమాదవశాత్తు నీటిలోపడి మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుధాకర్ తెలిపారు.

మురికి కాలువలోపడి గుర్తు తెలియని వ్యక్తి..

కామారెడ్డి క్రైం: మురికి కాలువలోపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్‌కాలనీలో శనివారం వెలుగు చూసింది. కాలనీలోని మురికికాలువలో మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వారు వెంటనే ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, మృతదేహం పాక్షికంగా కుళ్లిపోయిందన్నారు. నాలుగు రోజుల క్రితం చనిపోయిఉంటాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

మనస్తాపంతో ఆత్మహత్య

నవీపేట : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో మండల కేంద్రానికి చెందిన కొండూరు సాయిలు(33) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. సాయిలు తన ఇంట్లోని దూలానికి శనివారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దులు మృతి

రెంజల్(బోధన్): విద్యుత్‌షాక్ కారణంగా మండలంలోని తాడ్‌బిలోలి పెద్దవాగులో శుక్రవారం సాయంత్ర ఎద్దుల జత మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా బాసరకు చెందిన వ్యాపారి శనివారం మండలంలోని సాటాపూర్ సంతకు ఐదు జతల ఎద్దులను తీసుకుని వస్తున్నాడు. దారిమధ్యలో నీళ్లు తాగేందుకు వాగులోకి దిగిన రెండు ఎద్దులు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాయి. బోర్గాం గ్రామానికి చెందిన రైతు వాగులో మీది మోటారు ఏర్పాటు చేసి అక్రమంగా విద్యుత్ వినియోగించడంతో వైర్లు తెగి ప్రమాదం జరిగిందని స్థానికులు భావిస్తున్నారు. సదరు రైతు బాధిత వ్యాపారికి రూ.20వేలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

ఇరువర్గాలపై కేసు నమోదు

దోమకొండ: మండల కేంద్రంలో ఇంటి స్థలం విషయంలో గొడవపడి పరస్పరం దాడి చేసుకున్న అన్నాదమ్ముళ్లపై కేసు ననమోదు చేసినట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన అన్నాదమ్ముళ్లు పన్యాల బాపురెడ్డి, పన్యాల నాగరాజీరెడ్డి, పన్యాల రామ్మోహన్‌రెడ్డి మధ్య ఇంటి స్థలం విషయంలో గొడవ జరిగింది. ఇంటి స్థలం వద్ద తన భాగాన్ని తమ్ముడు రామ్మోహన్‌రెడ్డి కూలగొడుతున్నాడని తెలుసుకొని తన మరో తమ్ముడు నాగరాజీరెడ్డితో కలిసి వెళ్తే తమపై దాడి చేశాడని రామ్మోహన్‌రెడ్డిపై బాపురెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనపై తన అన్న బాపురెడ్డి, తమ్ముడు నాగరాజీరెడ్డి దాడి చేశారని రామ్మోహన్‌రెడ్డి సైతం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పర్మిట్‌రూమ్‌లో గొడవ చేసిన వ్యక్తిపై..

భిక్కనూరు: మండల కేంద్రంలోని వైన్స్ పర్మిట్‌రూమ్‌లో టేబుళ్లు ధ్వంసం చేసిన వేణుగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. వేణుగౌడ్‌తోపాటు మరో వ్యక్తి తాగిన మైకంలో పర్మిట్ రూమ్‌లోకి వచ్చి గొడవ చేశారు. వైన్స్ నిర్వాహకుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'స్లాట్' కోసం పడిగాపులు



మీ సేవ ఎదుట శుక్రవారం రాత్రి భోజనం చేస్తున్న బీరయ్య, భాగవ్వ

రామారెడ్డి: చిత్రంలో కనిపిస్తున్న భార్యాభర్తలు బీరయ్య, భాగవ్వ కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గొల్లపల్లికి చెందిన వారు. దివ్యాంగులైన వీరు సదరం స్లాట్ బుక్ చేసుకోవడానికి రామారెడ్డి మీ సేవ కేంద్రానికి మరో పదిమంది గ్రామస్తులతో కలిసి శుక్రవారం సాయంత్రమే వచ్చారు. వెంట భోజనం, దుప్పట్లు తీసుకొని వచ్చి మీ సేవ ఎదుటే నిద్రించారు. అయితే, ఇంటర్మీడియెట్ పరీక్షల కారణంగా శనివారం ఉదయం మీసేవ తెరుచుకోకపోవడం, మధ్యాహ్నం 2గంటల నుంచి సైట్ ఓపెన్ కావడంతో అప్పటి వరకు అక్కడే పడిగాపులు కాశారు. మధ్యాహ్నం సైట్‌ఓపెన్ కాగానే బీరయ్య, భాగవ్వతోపాటు మిగతా దివ్యాంగుల వివరాల నమోదుకే సమయం సరిపోయింది. సైట్ బంద్ కావడంతో స్లాట్ బుక్ కాలేదు.

మరోమారు సదరం స్లాట్ బుకింగ్‌కోసం ఇచ్చిన తేదీల్లో మీ సేవకు వచ్చి వేలిముద్ర పెడితే స్లాట్ బుకింగ్ పూర్తమవుతుందని మీ సేవ నిర్వాహకులు చెబుతున్నారు. దివ్యాంగులైన తాము ఒక రోజు ముందే మీసేవకు చేరుకొని రోడ్డుపై తిని అక్కడే నిద్రించినా పని కాలేదని బీరయ్య, భాగవ్వ ఆవేదనకు లోనయ్యారు. అధికారులు స్పందించి స్లాట్ బుకింగ్ సమయం పెంచాలని వారు కోరారు.